నాకు నచ్చిన నా కథ

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

ముప్ఫయి యేళ్ల క్రిందట 'భారతి'లో అచ్చయిన 'అన్నదమ్ములు' కథను నాకు నచ్చిన కథగా ఎంపిక చెయ్యటం అంత సుళువయిన పనిగా కనిపించలేదు. ఆ రోజుల్లో వరసగా ప్రచురింపబడిన కథలన్నీ కూడా బాగావున్నాయనే నా నమ్మకం – తర్వాత తర్వాత వివిధ పత్రికల్లో ప్రచురితమయిన చాలాకథల్లో కూడా బాగా వచ్చినవి యెన్నోవున్నాయి. ఏమయినా వ్యక్తియొక్క అభిరుచులనుబట్టి నచ్చటం నచ్చకపోవటం నిర్ణయించుకోవటం సహజం.

సర్వసాధారణంగా కుటుంబాల్లో డబ్బుకు అవసరాన్ని మించిన ప్రాధాన్యం యివ్వటం, ఆత్మీయులను దూరంచేసుకోవటం, సమయం దాటిపోయిన తర్వాత పశ్చాత్తాపపడటం మనమంతా గమనిస్తూనే వుంటాం. ఇలాంటి అనర్థకమయిన 'సాంప్రదాయాన్ని' ప్రతిబింబిస్తూ వ్రాయబడిన రచన ఆకర్షణీయంగా వుంటుందనే వుద్దేశంతో యీ కథను నిర్ణయించాను.

అన్నదమ్ములు

'అబ్బబ్బ! ఒక్క నిముషంకూడా నే నిక్కడ ఉండలేను '

'ఏమిటట్లా రుసరుసలాడిపోతావు. అట్టే సూస్తుంటే '

'అంతేలే నేనంటమే కనిపిస్తుందిగానీ, ఇంట్లో యేమిటి జరుగుతుందో నువ్వు పట్టించుకుంటేగా '

'ఏమిటయింది చెప్పమంటుంటే, ఏమిటా సోది పూరితే ' కస్సుమన్నాడు రాఘవులు.

'మంగి తేరగా వుందిగా! ప్రతి పనికి మంగీ మంగీ అని నా వెంటపడటం. ఆమె మాత్రం కూర్చున్న చోటునుంచి కదలకూడదు ఓ మూల బుడ్డాడేమో చంక దిగడాయె! అన్నింటికీ నేనే రావాలేంటి పోనీ బావ చెప్పరాదు '

'మా అన్నయ్యను యేమీ అనక చాలా మంచివాడు '

'అవున్లేవయ్యా, మీ అన్నయ్య మంచివాడు. మీ అక్కయ్యా మంచిదే. నడాన నువ్వూ నేనూ చెడ్డాళ్ళం అంతేగా '

'అసలు నీ కేంవచ్చిందో చెప్పరాదూ '

'నాకేం రాలా ఓ మాటడగనా సంక్రాంతి పండగ గదాని నా కొక్క చీర కొనిపెట్టావు! బుడ్డాడికి ఒక్క చొక్కా అన్నా తెచ్చావు! ఎందు కొచ్చిన శాకిరీ అంట ఈ రొచ్చులో వుండి. నేను దాసీదానిలాగ పనిచెయ్యట మూనూ, నువ్వేమో రెక్కలు విరుచుకోవటమూ యెందుకంట! మన యిల్లు మనం చూసుకోలేమా! ఈ నెల బావ యేమాత్రం తెచ్చాడు. ఆమె యేం పని చేసింది కూటికిలేనప్పుడూ చచ్చేటట్టు పనిచేశాము. ఇయ్యాల కొంచెం సంపా దిస్తున్నాంగదా అనుకుంటే అనుభవం లేకపోయె! పైగా మనిద్దరికి బండచాకిరీ తప్పకపోయె! నువ్వూ ఆలోచించు నేను అన్నానని కాదు ' మంగి రాఘవులు మొహంలోకి ఆలోచనగా చూసింది.

రాఘవులు ఏమీ సమాధానం చెప్పలేకపోయాడు. రాఘవుకు తెలుసు మంగి అన్నమాటల్లో గల సత్యం. తాము కొనుక్కున్న కొత్త రిక్షలో తన సత్తువ ఎంతుందో తనకు బాగా తెలుసు తాము కట్టుకున్న పూరింటికి తాను ఎంత శ్రమపడ్డాడో మరిచిపోలేదు. ఎవరికోసం యీ శ్రమ, ఎందుకోసం యీ బాధ అవి యెన్నడూ రాఘవులు ఆలోచించలేదు. తన కష్టార్జితం యింకోళ్ళ పాలవు తోందనికూడా యెప్పుడూ వూహించలేదు, తన జీవితం 'వడ్డించిన విస్తరి'కాదు తాను కష్టంచేసి బ్రతకాలి. ఈ సత్యాన్ని రాఘవులు పూర్తిగా గుర్తించాడు తాను శ్రమపడుతున్నప్పుడు కూడా యింకోళ్ళు తన శ్రమఫలితం అనుభవిస్తున్నారనే భావనే కలగలేదు. అందువలనే తాను అన్నతోపాటు యీవూరు వచ్చినప్పుడు మనం యెట్లా బ్రతకటం యెట్లా సంపాదించటం, యెట్లా జీవించటం యివే

సమస్యలు యిద్దరినీ బాధపెట్టినాయి. బండరాళ్ళను ముక్కలు ముక్కలుగా చేశారు. దుంగకొయ్యల్ని బద్దలుబద్దలుగా చీల్చారు. ధరిత్రిని శ్వేదబిందువులతో తడిపి, నారుపోసి పెంచారు. నిలువుటెండలో కడుపులు మాడ్చుకుని కట్టిన పునాదులమీదనుంచి భవనాలు లేవటం చూశారు. రెక్కలు ముక్కలుచేసుకుని వాగలిపట్టిన పొలం నవ్వింది. అదంతా యితరుల సొమ్ము. సోము, రాఘవులు తీవ్రంగా ఆలోచించుకున్నారు. దీనికి అంతం యేమిటి! మన శ్రమ మనకు అక్కరకు రావటంలేదు. ఇతరులకోసం మన రక్తం ధారపోయటం యెందుకు. ఎంతసేపు ఆలోచించినా యీ సమాజ వ్యవస్థయొక్క అంతు చిక్కలేదు. వాళ్ళు బ్రతకాలి. దీనికోసం యేంచెయ్యాలి. ఇదే ఆలోచన. ఎంత కష్టపడ్డా తిండికే సరిపోవడంలేదు. బ్రహ్మప్రళయంగా వరదలు వచ్చి పంటలన్నీ నాశనమయితే యేం. నీటిచుక్క లేక పోసిన నారు మలమల మాడిపోతే యేం, యెట్లాగయితే నేం తామున్నచోట తమకు తిండి దొరకదనే, పొట్టల్ని చేతపట్టుకుని దేశంమీద పడ్డారు. రకరకాల పనుల్లో తరతమభేదంలేకుండా తమ రక్తాన్ని ధారపోయటమే. దీంట్లోసుఖంలేదు. శాంతిలేదు. దీనికి ఒకతుదంటూలేదు. యౌవ్వనాన్ని వెనక్కు నెట్టేసి కాలం ముందుకు పరుగుత్తుకుపోతుందనీ యిద్దరికీ తెలుసు. యౌవనంలో అనుభవించవలసిన సుఖాన్ని బలిచేసుకున్న తర్వాత యింకా మనుగడే అనవసరం అని కూడా వాళ్ళిద్దరూ గ్రహించారు. ఇలాంటి ఆలోచనలు వాళ్ళిద్దర్నీ తీవ్రంగా కలవరపరచినాయి. ఎట్లానైనా తమ సొత్తంటూ ఒకటి యేర్పడని, అంతవరకు అవిరళంగా కృషిచెయ్యాలి. దాని తర్వాత అన్ని సమస్యలు వాటంతటవే చక్క పడతాయని అనుకున్నారు. పగలనక రాత్రనక తమ రక్తం అంతా ధారపోసి తాము లాగుతున్న రిక్షాను యజమానికిచ్చేసి, కొత్త రిక్షాను కొనేశారు. ఇప్పుడు యజమానికి తమ రక్తంలో భాగం ఇవ్వక్కర్లేదు. ఒకవారం పగలల్లా సోము రిక్షాను తీసుకుపోతే రాత్రిపూట రాఘవులు తీసుకుపోతాడు. వంతుల ప్రకారం యిద్దరూ రిక్షాచక్రాన్ని తిప్పేస్తున్నారు. ఎక్కడో పూరిబయట చౌకగా కొంచెంగ స్థలం కొనుక్కుని, ఓ పూరిగుడిసె వేసుకున్నారు. ఇల్లొచ్చింది. ఇల్లాలు రావాలి. సోము పెళ్ళిచేసుకున్న కొద్ది నెలల్లోనే రాఘవులూ పెళ్ళి చేసుకున్నాడు. తమల్ని పీల్చి పిప్పిచేసిన రిక్షా యజమానికి పోటీగా నిలబడ్డారు యిద్దరు అన్నదమ్ములూను! ఒక వస్తువును తను సొత్తు చేసుకోవడంలో వుండే సాధకబాధకాలు యిద్దరికీ పూర్తిగా అర్థమయినాయి. సోము, రాఘవులు అప్పుడప్పుడు తమ గత చరిత్రంతా జ్ఞాపకం తెచ్చుకుంటూ

విచారిస్తూ వుంటారు తోడికోడళ్ళిద్దరూ కళకళలాడుతూ యింట్లో తిరుగుతూ వుంటే అన్నదమ్ములిద్దరు ఆశలు చిగురించి పుష్పించి కాయలు కాసినట్లు సంతోషపడుతున్నారు సోముకు మగపిల్లాడే రాఘవులకు మగపిల్లాడే!

ఇప్పుడిప్పుడే రిక్షాను అద్దెకివ్వడం కూడా మొదలుపెట్టారు. అయితే రాబడి పూర్తిగా తగ్గిపోతోందని తెలిసిన తర్వాత శరీరం కష్టపడితేగాని డబ్బురాదని తెలుసుకున్నారు. ఇద్దరు అన్నదమ్ములల్లా ఆరుగురయ్యేటప్పటికి మనస్తత్వాలు విభిన్నంగా కనిపించటం మొదలుపెట్టినాయి దృక్పథాలు మారటం మొదలుపెట్టినాయి లెక్కలకు విలువ వచ్చింది తన మన అనే భావం ఒకరికి తెలియకుండా ఒకరికి పెరిగిపోయింది. అన్నదమ్ములు మౌనంగా వూరుకుంటున్నారు తోడికోడళ్ళు రచ్చకెక్కుతున్నారు. శాంతి, సంతోషం యెవరి మనస్సుల్లో వారికి వుంటుందనే మాట అసత్యమని యిద్దరి అన్నదమ్ములకు తోచింది తామున్న యింట్లో వుంటుంది శాంతి సంతోషము

నిజానికి రాఘవులు కష్టపడ్డంత సోము కష్టపడటం లేదు ఇది యివ్వాళ రాఘవులు తెలుసుకున్న సత్యం కాదు తాము మొదట యీ వూరు వచ్చినప్పటి నుంచి సోముకు, రాఘవులకు తెలిసిన విషయమే! శరీర దౌర్బల్యం వున్నా మనోబలంచేత యిన్నాళ్ళు సోము నెట్టుకొస్తున్నాడు సోము అండ చూసుకుని రాఘవులు కండలు పెంచుకున్నాడు అన్న సంగతి తనకు మొదటి నుంచి తెలిసినా మంగి యీనాడు ఆలోచిస్తున్నట్లు రాఘవులు యెన్నడూ కూడా ఆలోచించలేదు రాఘవులు తీవ్రంగా ఆలోచించుకుంటున్న కొద్దీ మంగి అంటున్న మాటల్లో సత్యం గోచరమవుతోంది. జీవితం శాశ్వతం కాదు ఓ మూల వృద్ధాప్యం ముంచుకొస్తుంది ఇట్లా యెన్నాళ్ళ సాగిపోవటం, పిల్లాడు పెరిగి పెద్దవాడయితే వాడు కూడా రెక్కలు విడుచుకోవాల్సిందేనా! నేను కష్టపడింది చాలదా! అయినా నేను కష్టపడింది నా కోసమేనా! నా సంతోషం కోసం కాదు నేను కష్టపడి సంపాదించిందంతా ఖర్చయిపోతే నా కొడుక్కి మిగిలేదేముంటుంది! యేవేమిటో ఆలోచనలు పరంపరలుగావచ్చి రాఘవుల మనస్సుమీద దాడిచేస్తున్నాయి. ఇంట్లో పోరు. బైట శ్రమ తనకు సుఖం లేదు ఈ రెండూ రాఘవులు మనస్సును తీవ్రంగా పీడిస్తున్నాయి వెనక తాము యీ వూరు మొదట వచ్చినప్పుడు తన అన్న, తాను యే విధంగా వున్నారో ఆ దృశ్యాలన్నీ కళ్ళలో వచ్చి నాట్యమాడేవి. వెంటనే దులపరించుకుని రిక్షా తీసుకుని ఎళ్ళిపోయేవాడు.

ఆనాడు రాఘవులు యింటికి వచ్చేటప్పటికి యింట్లో ఘర్షణపడుతున్నట్లు మాటలు వినిపించినాయి చప్పున వచ్చినవాడు వచ్చినట్లుగానే ఆగిపోయాడు.

'ఏమిటి యీ చాడింపు చీటికిమాటికి మంగి యేమిటేమిటో అంటూనే ఉంటుంది. ప్రతిదానికీ నేను సమాధానం చెపుతూ కూర్చోవాలి అంత యిదా మరి నాలుగు డబ్బులు యెక్కువ తెస్తున్నాడు గద తన మొగుడని యిష్టంవచ్చినట్లు అంటూంటె వూరుకోవడమేనా? పోనీ రాఘవులు యేమన్నా అంటాడేమో అంటే యేమీ మాట్లాడడు రామి కోపాన్నంతా వెళ్ళగక్కుతోంది

'రాఘవులను యేమీ అనక వాడు చాలా మంచివాడు

'అవున్లే నీ తమ్ముడూ మంచివాడే, మీ చెల్లెలు మంచిదే మధ్యన మనిద్దరమే చెడ్డాళ్ళం అంత కూటికిలేక చస్తున్నామా మన యిల్లు మనం చూసుకోలేమా? యెందుకొచ్చిన తంటా అంట యిది ' రామి దీర్ఘంగా సోము కళ్ళల్లోకి చూస్తూ విలబడింది.

సోము యేమీ సమాధానం చెప్పలేకపోయాడు

ఇంతలోనే మంగి తన పని పూర్తిచేసుకుని యింటికి వచ్చేసింది తన భర్త మొహం చూసీచూడటంతోనే మంగి చప్పున ఆగిపోయింది ఏమిటి అట్లా వున్నావని అడిగింది రాఘవులు మారు మాటాడకుండా యింట్లోకి వెళ్లాడు. సోము రిక్షా తీసుకుని బైటకు వెళ్ళిపోయాడు.

ఒకరి మాటలు ఒకరు వినాలనే ఇంత బిగ్గరగా సంభాషణలు రోజు రోజుకు సాగిపోతున్నాయి. నలుగురు పెద్దవాళ్ళు నాలుగు రకాలుగా ఆలోచించుకుంటున్నారు రాఘవులు అన్నను పిలిచి అడుగుదామనుకున్నాడు. సోము తమ్ముణ్ణి పిలిచి అడగనే అడిగాడు మంగి వల్ల తప్పేమీ లేదు మంగి అంటున్న మాటలన్నీ నిజమే? వదినకు నువ్వు సరిగ్గా చెప్పకపోతే మాత్రం చాలా కష్టమని కూడా రాఘవులు హెచ్చరిక చేశాడు సోము కూడా వెంటనే అనేశాడు మంగి వల్లనే యీ భేదాభిప్రాయాలు వచ్చినాయి. ముందర మంగిని సంబాళించుకుంటే అన్నీ సమసిపోతాయని రాఘవులుకు చెర్రున కోపం వచ్చింది సోము బాగా చిరాకుపడ్డాడు ఇద్దరూ ఎన్నడూ అనుకోని మాటలు అనుకున్నారు లోపం మంగి మండిపడిపోతోంది, బావ తన పెళ్లాన్ని వెనకేసుకు వస్తున్నాడని రామి బుస్సుమంటోంది, రాఘవులు తన పెళ్లాన్ని వెనకేసుకు వస్తున్నాడని

ఈ మాటలు, ఘర్షణ రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తోంది. చివరకు పంపకాలదాక వచ్చింది. ఇంట్లో చెంబూ, తప్పాలా నుంచి పంచుకోవటం అయిపోయింది. ఇక యిల్లుంది. రిక్షా వుంది. ఇంటి పంపకం ఎంతసేపటికి తెగలేదు. మంగి యేమి నూరిపోసిందో యేమో రాఘవులు గట్టిపట్టే పట్టాడు, ఆ యింట్లో సగంకంటె యెక్కువ భాగం తనకు రావాలని. సోము, రాము యెన్ని చెప్పినా, ఆ మాటకు వప్పుకున్నాడు. హద్దులు గీసుకున్నారు. ఎవరి స్థలంలో వారు తలొక పాక వేసుకున్నారు. ఇక రిక్షా సంగతి వచ్చే టప్పటికి పంపకాలు కుదర్లేదు. ఇద్దరికీ తెలుసు. ఈనాడు రిక్షాను అమ్మితే చెరొక రిక్షా కొనుక్కోలేమని. కిరాయి రిక్షా తీసుకుంటే యెంతో కష్టమని. మునుపటి మాదిరిగానే పగల్లా ఒకడు, రాత్రిళ్ళు ఒకడు వంతులు చొప్పున రిక్షాను లాగి సంపాదించుకుని తింటున్నారు. ఆ యిద్దరికీ అదివరకు మాదిరిగానే ఆ రిక్షాయే జీవనాధారం.

మంగి వూహించినట్లుగానే రాఘవులు సంపాదనతో తన కొక చీరె అని కొడుక్కి చొక్కా అని భర్తకు ధోవతి అని సంపాదించుకో గలిగింది. విడిగావున్న తర్వాత రాఘవులకు మంగి అన్న మాటలన్నీ ఒక్కొక్కటి అనుభవంలో కనిపిస్తున్నాయి.

కాలచక్రంతోపాటు రిక్షాచక్రం రాలేక యెంతో వెనక్కి పడిపోయింది. ఆ ఊళ్లో సిటీబస్సులు వచ్చేసినాయి. మైలు వెళ్లాలంటే అణా యిస్తే యిట్టే వెళ్ళిపోతారు. పావలా యిచ్చి రిక్షాయెక్కే నాధుడు యెవరూ కనిపించటం లేదు. రిక్షాల గిరాకి చూస్తూ చూస్తుండగానే యిట్టే వడిపోయింది. తాము అదివరకు సంపాదించేదాంట్లో సగంకూడా రావటంలేదు. ఇంత సంపాదించిన వాళ్లం ఓ చిల్లరకొట్టు పెట్టుకున్నా యీపాటికి మన జీవనానికి దిగులులేకుండా పోయేది. అనవసరంగా రిక్షా కొనుక్కుని యెందుకూ కొరగాకుండా పోయామే అని బాధపడుతున్నారు రిక్షా యజమానులు. ఈ వచ్చిన కొత్త మార్పుతో అన్నదమ్ము లిద్దరిమధ్య వైరుధ్యం పెరిగింది. ఎవరికి వారు ఆ రిక్షా తన సొత్తే కావాలని పట్టుదలతో వున్నారు. ఎంతసేపటికి యిద్దరి మధ్య సమన్వయం కుదర్లేదు. వీరిద్దరూ యింట్లో మనస్పర్థలు పెంచుకుంటూనే వున్నారు. ఈ మధ్యలోనే యింకో వుపద్రవం వచ్చిపడింది. మునిసిపాలిటీవారు రిక్షాలను తీసేస్తున్నారనే వదంతి పుట్టింది. రిక్షా యజమానులు, రిక్షా లాగేవాళ్ళు సభలు, సమావేశాలు జరిపి ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు. రిక్షాలను

వుంచాలంటూ కార్మిక నాయకులు పోయిన పలుకుబడిని వుపయోగించుకోవటానికి యీ అవకాశాన్ని రాయకత్తులా వినియోగించుకుంటున్నారు. ఎంత ఆందోళన జరిపినా ఏమీ ప్రయోజనం లేకపోయింది. మునిసిపాలిటీవారు తమ సమావేశంలో రిక్షాలను తీసెయ్యాలని నిశ్చయించారు. ఈ నిర్ణయం అమలు జరపంగానే నీటినుంచి బైటపడవేసిన కప్పలులాగా రిక్షా యజమానులు, రిక్షా లాగేవాళ్ళు తన్నుకుపోయారు గిలగిల. అదివరకు సంపాదించిన సొమ్ము పెట్టుకుని కొంతమంది యజమానాలు యింకోరకం వ్యాపారంలోకి దిగారు. రిక్షా లాగేవాళ్ళు కూలీనాలీ చేసుకుని బ్రతుకుతున్నారు. అతి కష్టంమీద విడివిడి భాగాలు తీసి అమ్మితే రాఘవులుకు, సోముకు తాను ఇచ్చిపెట్టిన సొమ్ములో మూడోవంతు వచ్చింది. రిక్షా అమ్మకంతో ఆ డబ్బును చెరిసగం పంచుకోవడంలోనూ కూడా తగాదాలుపడి చివరకు యెట్లాగొట్లా సర్దుబాటు చేసుకున్నారు రిక్షా పోవటంతో భుక్తి గడవటం యెంతో కష్టమయిపోయింది. రెక్కలు విడచుకున్నా పొట్టకు పిల్లల్ని పోషించాలంటే సుంగికి, రాఘవులకు పెద్ద సమస్య అయిపోయింది. సోమూ అదే స్థితిలో వున్నాడు. తన కుటుంబాన్ని పోషించె గత్యంతరంలేక రాఘవులు తన స్థలాన్ని, యింటిని అమ్ముకుని యెక్కడో పూరిగుడిసెలో నెలకు మూడు రూపాయల అద్దెలో కాలక్షేపం చేస్తున్నాడు. సోము కూడా తప్పనిసరిగా తన యింటిని కూడా అమ్మెయ్యాల్సి వచ్చింది.

తనకొచ్చిన డబ్బుతో విశ్వప్రయత్నం చేశాడు యింకా డబ్బు సంపాదించాలని. చిన్న దుకాణం పెడితే దాంట్లో నష్టం వచ్చింది. ఏ పని చేస్తే ఆ పని తనకు యెదురయి కూర్చుంది. రాఘవులకు తలకు మించిన పనయిపోయింది. ఎటూ తోచటంలేదు. మంగి రెండు పూట్లా రెండిళ్ళకు వెళ్ళి బండచాకిరీ చేసివస్తుంది. తాను అక్కడా యిక్కడా తిరిగి ఆ పనీ యీ పనీ చేసుకుని యింటికి వస్తాడు రాఘవులు.

ఏ పూట కూలి ఆ పూటకు గడవటానికే సరిపోవటంలేదు. సోముకు యెక్కడలేని వోపికా వచ్చింది. ఒక్క క్షణం కూర్చోకుండా ఏదో పనిమీద వెళుతూనే వుంటాడు. రామి ప్రొద్దస్తమానం చాకిరీ చేస్తూనే వుంటుంది. అప్పుడప్పుడు వెనకటివన్నీ జ్ఞాపకంవచ్చి ఏడుస్తుంది. సోము, తాను తమ్ముణ్ణి అపార్థం చేసుకున్నానేమో అని బాధపడుతూ వుంటాడు. రాఘవులు చాలా మంచివాడు. మంగి కూడా చాలా మంచిదే. నేను తెలుసుకోలేకపోయాను.

మొట్టమొదట తాను, తన తమ్ముడు ఈ వూళ్లోకి వచ్చినప్పుడు ఎట్లా వున్నారో జ్ఞాపకం తెచ్చుకుంటూ విచారపడతాడు. తన తమ్ముడి జాడ తనకు తెలియదు. ఈ వూళ్లో వున్నాడో లేదో కూడా తెలీదు. రాఘవుల్ని చూసి చాలా రోజులయింది. సోము దీర్ఘంగా ఆలోచించుకుంటున్నాడు.

రాఘవులు దిగాలుపడి అరుగుమీద కూర్చుని కళ్ళు తుడుచుకుంటున్నాడు. తాను తన అన్నతోపాటు యీ వూరు వచ్చినప్పటి నుంచి జరిగిన మార్పులన్నీ గుర్తుకొస్తున్నాయి ఒక్కొక్క విషయమే తొలిచి తొలిచి రాఘవుల్ని బాధ పెడుతున్నాయి. మంగి చెప్పిన మాటలు విని అనవసరంగా అన్నతో విరోధము తెచ్చుకున్నాను. అన్న చాలా మంచివాడు. వదిన చాలా మంచిది. అన్నను చూసి ఎన్నాళ్ళయిందో సరి! ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో! రాఘవులు క్షోభపడిపోతున్నాడు. మంగి లోపలలోపల కుమిలిపోతోంది. సుఖపడదామనుకున్న రోజుల్లో మళ్లీ కష్టాలు మొదలయినాయి. ఏ విధంగా జీవితం మళ్లీ మారిపోనుందో చూచి బాధపడుతోంది. వెనకటివి తలుచుకుని విచారపడుతోంది. రాఘవులుకు గాని, తనకు గాని వూపిరి సలపనంత పని, అయితే శ్రమకు తగినంత ఫలితం మాత్రం దొరకటంలేదు. తాను కృంగిపోతోంది. రాఘవులు చిక్కిపోతున్నాడు ఏమి చెయ్యటానికీ తోచటంలేదు.

ఎవరో బొంబాయి నుంచి పెద్ద వ్యాపారస్థులు వచ్చి యిక్కడకు మూడుమైళ్ళ దూరంలో ఒక పెద్ద ఫ్యాక్టరీ కట్టబోతున్నారని అనోటా అనోటా వినవచ్చింది. ప్రతి నోటా యీ మాటే వినిపిస్తోంది. రాఘవులు నిశ్చయించుకున్నాడు, ఆ ఫ్యాక్టరీ పూర్తి అయ్యేటంతవరకు అసలు మకాం యెత్తి అక్కడే వుండిపోతే సరిపోతుందని.

తమ పొట్టల్ని చేతపట్టుకుని ఎక్కడెక్కడివాళ్ళు అక్కడకు తయారయ్యారు. బ్రహ్మాండంగా పనులు సాగిపోతున్నాయి. చుట్టూ రకరకాల యిళ్ళు, ఆ ఫ్యాక్టరీ కట్టడం, చేతి నిండా పని దేనికీ వెతుక్కోనక్కర్లేదు. మంగి తలకు ఓ చుట్టచుట్టి బయలుదేరుతుంది. రాఘవులు పలుగూ పార పట్టుకుని బయలుదేరుతాడు. అణగారిన హృదయాల పునాదులమీద పైకిలేచిన భవనాల మాట గుర్తుకొచ్చి తన గతి చరిత్రను, గత ఆలోచనలను స్ఫురణకు తెచ్చుకుంటున్నాడు వెకిలిగా తనలో తాను నవ్వుకుని మనం యీ జన్మలో భాగ్యవంతులం కాలేము. భాగ్యవంతులు యింకా భాగ్యవంతులవుతారు. బీదవాళ్ళు యింకా బీదవాళ్ళవుతారు. వాళ్ళకు డబ్బుంది. మనకు

రెక్కలున్నాయి. మనం కష్టపడాల్సిన వాళ్ళం. అది తప్పదు, రాఘవులు యేమేమిటో ఆలోచించుకుంటూ పనిచేసుకునిపోతున్నాడు.

ఎండ చుర్రుమంటోంది. సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చేశాడు. రాఘవులు స్వేదస్నానం చేస్తున్నాడు. ఎంతో నిబ్బరంగా గుండె బరువుతో పారతో లాగిన మట్టిని తట్టలోకి వేస్తున్నాడు. మంగి ఆయాసపడుతూ అక్కడే చతికిలబడిపోయింది. రొప్పుతోంది. ఒక్కసారి పైకి చూసింది. సూర్య కిరణాలు వాడిగా కళ్ళల్లోకి పొడుచుకుని పోయినాయి. చప్పున కళ్ళు మూసుకుంది. రాఘవులు తట్టనిండా మట్టిని నింపేసి పలుగును గట్టిగా భూమిలోకి దింపేసి దాని ఆసరాతో అట్లాగే నిలబడిపోయాడు రొప్పుతూ. మేస్త్రీ యెక్కడ పనికట్టాడో యేమో చప్పున రాఘవులువైపు గబగబ వస్తున్నాడు. మంగి చప్పున లేచి నిలబడి తట్ట నెత్తిన పెట్టుకుని చకచక నడిచింది. రాఘవులు భూమిలోకి గుచ్చిన పలుగును పైకి లాగాడు రౌద్రంగా. మేస్త్రీ చూచీచూడకుండా యింకోవైపు వెళ్ళిపోయాడు, కూలీలు గుంపులు గుంపులుగా వచ్చేస్తున్నారు. పని చురుకుగా సాగిపోతోంది. మేస్త్రీ పంపించాడు గామాలు ఓ పదిమంది కూలీలు పలుగులు, పారలు పట్టుకుని రాఘవులున్న చోటుకు వచ్చేసి భూమిని త్రవ్వేస్తున్నారు. వంగిన నడుమును ఎత్తలేక అతి కష్టంమీద మట్టితట్ట యింకోడి ఆసరాతో పైకెత్తి తలమీద పెట్టబోయే సరికి "రాఘవులూ ...." అంటూ గట్టిగా కౌగిలించుకున్నాడు సోము. రాఘవులుకు కొద్దిక్షణాలదాకా నోటినుంచి మాట పెగిలిరాలేదు

ఆదుర్దాగా మంగెక్కడ, పిల్లలెక్కడ అంటూ సోము కుశలప్రశ్నలు వేశాడు. రాఘవులు కూడా యెంతో ఆప్యాయంగా క్షేమసమాచారాలు అడిగి అన్నా నేను పెద్ద తప్పు చేశాను అంటూ కంటతడి పెట్టుకున్నాడు

సోము తమ్ముణ్ణి దగ్గరకు తీసుకుంటూ 'రాఘవులూ నువ్విట్లా అనక. నేనూ చేశాను.... డబ్బువున్నప్పుడు ఒకరి సుఖాన్ని చూసి ఒకరి ఓర్వలేకపో యినాము. డబ్బు పోయిన తర్వాత ఒకరి కష్టాన్ని చూసి ఒకరు జాలిపడాల్సి వచ్చింది... మనకు మిగిలింది మన రెక్కలే.... మధ్యలో వచ్చిన డబ్బు కాదు... మనం అన్నీ పంచుకున్నాం. కాని మన ప్రేమల్ని పంచుకోలేకపోయినాము....' ఇద్దరు అన్నదమ్ములు పెనవేసుకుని వెక్కి వెక్కి ఏడ్చారు.

దూరాన్నుంచి చూసిన మంగి పరుగు పరుగున వచ్చి 'బావా అక్కె క్కడ !....' అంటూ బావురుమంది.

———